క్లుప్తంగా

ఓటీఎస్ పట్టాల పంపిణీ



ఓటీఎస్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జోత్స్న, సర్పంచి దేవమాత

జూపూడి(ఇబ్రహీంపట్నం): స్థానిక గ్రామ సచివాలయం వద్ద వన్ టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) పట్టాలను ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచి కాకి దేవమాత, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మతో గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన ఓటీఎస్ పథకంలో 83 మందికి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు గాంధీ, జానీ, గ్రామ కార్యదర్శి మునేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైభవంగా కూడారై



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో శోభనగిరిపై ఉన్న శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారైను గురువారం వైభవంగా నిర్వహించారు. గోదాదేవికి విశేష స్నపన, అలంకరణ, సామూహిక కుంకుమార్చన, తిరుప్పావై సేవాకాలం, అనంతరం 108 పాత్రల్లో గోదాదేవికి పొంగలి నైవేద్యాన్ని సమర్పించారు. అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ భవానీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోడి పందేల బరులు ధ్వంసం



కోడి పందేల బరుల్లో టెంట్లు తొలగిస్తున్న సీఐ రమేష్

రెడ్డిగూడెం: కోడి పందేల బరులను పోలీసులు ధ్వంసం చేశారు. మండలంలోని రంగాపురం, రెడ్డిగూడెం గ్రామ శివారు మామిడి తోటల్లో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించడానికి బరులను ఏర్పాటు చేస్తున్నారు. మామిడి తోటల్లో కోడి పందేల శిబిరాలు ఏర్పాటు చేశారన్న సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఆ ప్రాంతానికి వెళ్లి వాటిని ధ్వంసం చేశారు. మైలవరం సీఐ రమేష్ మాట్లాడుతూ ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి పందేల బరులు ఏర్పాటు చేసిన స్థల యాజమానిపై బైండోవర్ కేసు నమోదు చేస్తామన్నారు. కోడి కత్తుల తయారీదారులు, కోడి పందేల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఆనంద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీని వినియోగించుకోవాలి

తోలుకోడు(మైలవరం): ఉపాధి హామీ పనులను గ్రామస్తులు వినియోగించుకోవాలని సర్పంచ్ దుర్గారెడ్డి తెలిపారు. మండలంలోని తోలుకోడు గ్రామంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి ఆదేశాలతో సర్పంచ్ దుర్గారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.రామారావు ఆధ్వర్యాన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా సోషల్ ఆడిట్ 2020–21, 2021–22 సంవత్సరాలకు సంబంధించి గురువారం గ్రామ సభ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు బుర్రి ప్రతాప్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. జి.కొండూరు ఎంఈఓ నరసింహారావు స్వతంత్ర పరిశీలకుడిగా వ్యవహరించారు. మండల స్థాయి అధికారులు ఎస్.వంశీకృష్ణ, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి బి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలో.. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పని చేస్తున్న క్లాప్‌మిత్రలు, షెడ్ మిత్రలకు దుస్తులు, గ్రీన్ జాకెట్స్, మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు, హ్యాండ్ వాష్ లిక్విడ్, డెటాల్ లిక్విడ్ సబ్బులు, కొబ్బరి నూనె అందజేశారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు.

విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు

చాట్రాయి: విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ కూన వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో గృహ, వ్యాపార సముదాయాలపై దాడులు నిర్వహించారు. విజిలెన్స్ బృందాలు 275 గృహ సర్వీసులు, 284 వాణిజ్య సర్వీసులపై దాడులు నిర్వహించి రూ.4.65 లక్షల జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు. దాడుల్లో నూజివీడు రూరల్, విస్సన్నపేట సబ్ డివిజన్ల ఏడీలు దుర్గారావు, పి.రామకృష్ణ, కె.నారాయణ, ఏఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి పీడితులకు మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే కె.రక్షణనిధి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: కిడ్నీ వ్యాధిపీడితులకు మెరుగైన వైద్యం చేయిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణ నిధి అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. ఎమ్మెల్యే రక్షణనిధి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఎ.కొండూరులో పర్యటించి కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరామర్శించి వారికి అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. వెంటనే అధికారులు స్పందించి డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. మూడు కోట్లతో తిరువూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్లుగా కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో కృష్ణా జలాలు సరఫరా చేయిస్తున్నామని, స్థానిక పీహెచ్‌సీలో 15 రకాల మందులు అందజేస్తున్నామని, ఉచిత వాహన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. డయాలసిస్ రోగులకు నెలకు రూ. 10 వేల పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. త్వరలో రూ. 38 కోట్లతో మండలానికి కృష్ణా జలాలు సరఫరా చేయించి ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, సర్పంచ్ వి.రజని, ఎంపీటీసీ కోట పుల్లారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాలసాని చెన్నారావు, సతీష్, సోలా నరసింహారావు, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షులు టి. సురేష్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నాగేశ్వరరావు, వైద్యాధికారి దివిజ, వైస్ ఎంపీపీ సిద్ధం పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు తయారు చేయండి

కమిషనర్ శ్రీధర్



కొండపల్లి మున్సిపాల్టీ ఒకటో వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీధర్, తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అంచనాలు తయారు చేసి పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. కొండపల్లి మున్సిపాల్టీలోని ఒకటో వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ గురువారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, తాగునీటి సమస్యలను తెలియజేశారు. నగదు రహిత సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఆర్థిక పరమైన సమస్యలకు అంచనాలు రూపొందించి పరిష్కరిస్తామని ప్రజలకు చెప్పారు. పారిశుద్ధ్యంపై సూపర్‌వైజర్లకు సూచనలు చేశారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిద్దాం



విజేత జట్టుతో డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్

నూజివీడు: ఏలూరు ఎస్పీ ఆదేశాల మేరకు నూజివీడు సబ్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్లలో గురువారం సంక్రాంతి క్రీడోత్సవాల్లో భాగంగా వాలీబాల్ టోర్నమెంట్‌ను మండలంలోని హనుమంతునిగూడెంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, కోడిపందేలు, జూదం వంటి ఆటలు కాకుండా, సంప్రదాయ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. 20 జట్లు పోటీపడగా విజేత జట్టు 'ఆగిరిపల్లి'కి రూ.10,116 నగదు బహుమతిని అందజేశారు. రూరల్ సీఐ అంకబాబు, రూరల్ ఎస్ఐ రామకృష్ణబాబు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



వెదురుబీడెం ఎంపీయూపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



కొండపల్లి క్రాంతి హైస్కూల్లో..



రంగవల్లులను పరిశీలిస్తున్న సర్పంచ్, తహసీల్దార్



జి.కొండూరు ఎంపీడీఓ కార్యాలయంలో..

వెదురుబీడెం(మైలవరం): తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండగని వెదురుబీడెం సర్పంచ్ సాంబశివరావు తెలిపారు. మైలవరం మండలం కనిమెర్ల సీఆర్ నగర్‌లోని ఎంపీయూపీ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భోగి మంటలు వేశారు. బాలికలు పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు తీర్చిదిద్దారు. చిన్నారులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భోగి పళ్లు పోశారు. విద్యార్థులకు గాలిపటాలు, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రాజేశ్వరి, కృష్ణ, బి. అయ్యన, ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. చిన్నారులపై భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలతో అలరించారు. విద్యార్థులు కోలాటం, సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్, మాజీ సర్పంచి అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: సహాయమాత పాఠశాలలో గుడ్ సమరిటన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాప అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరావు, కార్యదర్శి వేల్పుల రాజేష్, హఫీజ్ ఖాద్రి, మేకల భాను, హెచ్ఎం సిస్టర్ రంజిత తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు చాటాలని తహసీల్దార్ దాసరి సుధ పేర్కొన్నారు. బలివే సచివాలయం వద్ద సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యులు దాసి రాటాలు, యూపీ స్కూల్ హెచ్‌ఎం సుబ్బారావు, నాగుల నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ముగ్గులు వేసి పాలు పొంగళ్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనరాధ, అధికారులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



నూజివీడులో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: పట్టణంలోని బెతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో సంక్రాంతి క్రీడా సంబరాల్లో భాగంగా వాలీబాల్ డివిజన్ స్థాయి టోర్నమెంట్ పోటీలను గురువారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లారావు, నూజివీడు ఉప విద్యా శాఖాధికారి సేవియా, బిస్ స్కూల్ కరస్పాండెంట్ మెలోడి, ఆగిరిపల్లి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో సమస్యల పరిష్కారం

తిరువూరు: భూ సమగ్ర సర్వేతో సరిహద్దు సమస్యలు పరిష్కారమవుతాయని తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి అన్నారు. మండలంలోని ఆంజనేయపురంలో గురువారం భూముల రీసర్వే పూర్తైన సందర్భంగా రైతులకు మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాల జారీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు నిర్దుష్ట భూవిస్తీర్ణం, సరిహద్దులతో కూడిన పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు. తిరువూరు తహసీల్దార్ సురేష్‌బాబు, టేకులపల్లి పీఏసీఎస్ చైర్మన్ సీతారామయ్య, సర్పంచి మామిడి కుటుంబరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులు సంఘాలను మరింత బలోపేతం చేయాలి

రెడ్డిగూడెం: పాడి రైతులు సంఘాలను మరింత బలోపేతం చేయాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కొత్తరెడ్డిగూడెం గ్రామంలోని మైలవరం క్లస్టర్ పరిధిలో గురువారం సొసైటీ అధ్యక్షుడు, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ పాడి రైతుల సంఘాలను మరింత బలోపేతం చేయడానికి మిల్క్ యూనియన్ అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. ఈ సందర్భంగా కొత్తరెడ్డిగూడెం, రంగాపురం సొసైటీ సంఘాలను సందర్శించారన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్, సొసైటీ అధ్యక్షులు ఉయ్యూరు అంజిరెడ్డి, కుదప, అన్నేరావుపేట, కొత్తనాగులూరు, తాడిగూడెం అధ్యక్షులు పద్మజ, రాంబాబు, రంగ భారతి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కబడ్డీ పోటీలు

గంపలగూడెం: సంక్రాంతి సందర్భంగావినాయక్ యూత్ గంపలగూడెం ఆధ్వర్యాన ఈనెల 14వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్ వెనుక ఖాళీ స్థలంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఎన్టీటీపీఎస్ నూతన ప్లాంటు అందుబాటులోకి తేవాలి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి విజయానంద్, తదితరులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో నిర్మాణంలో ఉన్న 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటును ఫిబ్రవరి 15నాటికి అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఎన్టీటీపీఎస్ 5వ దశ నిర్మాణ పనులు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. బీజీఆర్, బీహెచ్‌ఈఎల్ కంపెనీల ప్రతినిధులతో ప్లాంటులో పర్యటించారు. నిర్మాణంలో పురోగతి, పెండింగ్ పనులపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభానికి అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయిస్తానన్నారు. అదనపు సిబ్బంది నియమించుకుని వేసవి వచ్చేలోపు విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కావాలన్నారు. ముఖ్య కార్యదర్శి ఆదేశాలతో వచ్చేనెలలో ప్లాంటు ప్రారంభానికి సిద్ధం కానుంది. జెన్‌కో జేఎండీ పృధ్వీతేజ్, థర్మల్ డైరెక్టర్ చంద్రశేఖర్, సీఈ అశోక్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి



లకిరెడ్డి కళాశాలలో వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాశ్‌రెడ్డి



తిరువూరు శ్రీనిధి స్కూల్లో ..

మైలవరం: విద్యార్థినిలు సృజనాత్మక నైపుణ్యం ప్రదర్శించడం అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ ఫెస్టివల్ డే పురస్కరించుకుని గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వామి వివేకానంద జయంతిని ఐసీసీ సహేలీ గరల్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్, ప్రకృతి క్లబ్, ఏఐసీటీఈ, ఎస్‌పీఐసీఈఎస్, ఎన్‌సీసీ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సెలెబ్రేటింగ్ ద ఫెస్టివల్ ఆఫ్ హ్యాపీనెస్ అనే అంశంపై రంగోలీ, కైట్ ఫెస్టివల్, షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు, మెహందీ డిజైన్స్ జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఐసీసీ ప్రిసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ శోభారాణి, రాణిరుద్రమ తదితరులు ప్రసంగించారు. కళాశాల హానరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు కైట్ ఫెస్టివల్ ప్రారంభించారు. లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, లకిరెడ్డి అన్నపూర్ణ విజేతలకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, సహేలీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

- మైలవరంలో బీజేపీ ఆధ్వర్యాన స్థానిక బోసు బొమ్మ సెంటర్‌లో జరిగిన స్వామి వివేకానంద జయంతిలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

తిరువూరు: పట్టణంలోని పలు పాఠశాలల్లో గురువారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. శ్రీనిధి, నాగార్జున స్కూళ్లలో వివేకానంద విగ్రహాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద జీవితచరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అలరించిన పంచరత్న గానం



తిరువూరులో పంచరత్న గానం చేస్తున్న మహిళలు

తిరువూరు: 69వ త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా తిరువూరు శ్రీచంద్రమౌళీశ్వరాలయంలో గురువారం పలు కార్యక్రమాలు జరిగాయి. భారత దేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచయిత రేపాక రఘునందన్‌కు త్యాగరాజ గానకళాసమితి కార్యదర్శి మురుకుంట్ల సీతారామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో సన్మానం చేసి త్యాగరాజ పురస్కారం అందజేశారు. త్యాగరాజస్వామి పంచరత్న గానాన్ని కాలపుటపు శ్యామ, శ్రీవల్లి, శ్రీలత, సరిత, ప్రత్యూష, చిత్రసింధు, ఉషామాధురి, శ్వేత, నీహారిక ఆలపించారు. మొగిలిచర్ల నాగమణి హరికథాగానం, సోమయాజుల ఉషామాధురి, యడవల్లి పద్మావతి గాత్రకచేరీ కార్యక్రమాలు జరిగాయి.

కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఆర్డీఓ రవీంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ పక్కన తహసీల్దార్, ఈఓ, చైర్మన్, సీఐ, తదితరులు

పెనుగంచిప్రోలు: అధికారులు బాధ్యతగా, సమన్వయంతో పనిచేసి శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల, కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు అన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరిగే అమ్మవారి పెద్ద తిరునాళ్లకు సంబంధించి గురువారం ఆలయ ఆవరణలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఉత్సవాలపై ఆలయ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఉత్సవాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు తాగునీటికి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 5న జరిగే అమ్మవారి కల్యాణానికి సంబంధించి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జగ్గయ్యపేట సీఐ నాగమురళి మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి బందోబస్తును సెక్టారులుగా విభజించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. గత ఉత్సవాల్లో మాదిరి అధికారులు అందరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. ఈఓ డీవీఎస్ లీలాకుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5న అమ్మవారి కల్యాణంతో పాటు దీక్షాస్వాముల తిరుముడి కార్యక్రమం ఉంటుందన్నారు. 6న జలబిందెల కార్యక్రమం, 7, 8 అంకమ్మవారికి క్రతువులు, 9న పూర్ణాహుతితో పెద్ద తిరునాళ్లు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఎస్ఐ హరిప్రసాద్, వైద్యాధికారి ఇందిర, వివిధ శాఖల అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వాహనం చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పెట్టిన మోపెడ్ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట వాగు సెంటర్‌కు చెందిన కురెంద దావీదు కూలీ పనులు చేస్తుంటాడు. దావీదు తన అవసరాల కోసం ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఈ నెల 8న పని ముగించుకుని ఇంటికి వచ్చిన దావీదు తన మోపెడ్‌ను రోడ్డుపై పెట్టి తాళం వేశాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి చూసే సరికి మోపెడ్ కనిపించక పోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోరీ

పెద్దాపురం(వీరులపాడు): పెద్దాపురంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఆలయ అర్చకులు బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆలయానికి తాళాలు వేశారని, అర్ధరాత్రి 12 గంటల వేళ గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారన్నారు. ఆరు మంగళ సూత్రాలు, 400 గ్రాముల వెండి వస్తువులు, హుండీలోని సుమారు రూ.10 వేల నగదు అపహరించారన్నారు. ఆలయ పర్యవేక్షకుడు చెరుకూరు రామారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూముల రీ సర్వేకు డ్రోన్లతో ట్రయల్ రన్

నందిగామ: డివిజన్‌లో భూముల రీసర్వే కార్యక్రమానికి సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. భూముల రీ సర్వే కోసం వినియోగించే డ్రోన్లకు నందిగామ పట్టణ పరిధిలోని పంట పొలాల సమీపంలో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. డ్రోన్ల కంపెనీకి చెందిన ప్రతినిధులు వాటిని వినియోగించే విధానం, పనితీరుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వే అధికారులు రవీంద్ర ప్రసాద్, జగన్ మోహనరావు, మండల సర్వేయర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం రైతులకు సన్మానం

ముసునూరు: ప్రకృతి సేద్యంతో 365 రోజులు ఆరోగ్యకరమైన పంటలను సులభంగా పండించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయం జోనల్ కో–ఆర్డినేటర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ఎనిమిది మందిని గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద 36 రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలను 365 రోజులూ పెంచి, వాడుకోవాలని సూచించారు. వలసపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్‌లు సీహెచ్ దామోదరరావు, డి.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు త్రిశక్తి పీఠంలో విశేష పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): త్రిశక్తిపీఠంలో శ్రీకాశీమాత, శ్రీమహాలక్ష్మీ, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు శనివారం ఉదయం 10 గంటలకు విశేష పుష్పార్చన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు వివిధ పుష్పాలను(బంతిపూలు మినహా) శుక్రవారం రాత్రి 8 గంటల లోపు దేవస్థానంలో సమర్పించాలని పేర్కొన్నారు.

వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానవ జీవితంలో వృద్ధాప్య దశ ఎంతో కీలకమైనదని, నిరాశ్రయులైన వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ అన్నారు. ఆ సొసైటీ ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమ సేవా సంస్థలోని వృద్ధులకు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి కుటుంబ సభ్యుల ఆదరణ ఎంతో అవసరమని, అయితే నేటి సమాజంలో చాలా మంది వృద్ధులు నిరాశ్రయులుగా మారుతున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు దూరం అవుతున్న నేపథ్యంలో కుటుంబ బాంధవ్యాలు తగ్గిపోతున్నాయని చెప్పారు. తమను పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించాల్సిన వారే అనాథ ఆశ్రమాల్లో, రోడ్లపై వదిలేసి వెళ్లడం అత్యంత బాధాకరమన్నారు. వృద్ధాశ్రమాల ద్వారా ఇలా నిరాదరణకు గురైన వృద్ధులను చేరదీసి, వారి బాగోగులు చూడడం అభినందనీయమన్నారు. సొసైటీ ఉపాధ్యక్షులు కనకాల ప్రసాద్, మందా రాము, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సహాయ కార్యదర్శి గోకర్లేశ్వరరావు, విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.